# ''తనకు కలిగిన దంతయు''
# (మత్తయి 13:44-46)

బోధించే మనలో ఎక్కువమందికి - ఒక చిన్న సత్యాన్ని తీసికొని దీర్ఘమైన ప్రసంగంగా పెంచే సామర్థ్యముంది. మరో వైపు, ప్రభువైన యేసైతే బహు ఘనమైన సత్యాలను తీసికొని, కొద్ది, శక్తివంతమైన ప్రతిపాదనలలోనికి నొక్కివేయగలిగింది కద్దు.

శక్తివంతమైన చిన్న ప్రతిపాదనలను యేసు చేశారు. అవి మూడు వచనాల్లో యిమడ్చబడ్డ రెండు ఉపమానాలుగా కన్పిస్తాయి. మనము వాటిని ఈ పాఠంలో చదువుదాం.

> పరలోకరాజ్యము, పొలములో దాచబడిన ధనమును పోలియున్నది. ఒక మనుష్యుడు దాని కనుగొని దాచి పెట్టి, అది దొరికిన సంతోషముతో వెళ్లి, తనకు కలిగిన దంతయు అమ్మి ఆ పొలమును కొనును.
>
> మరియు పరలోకరాజ్యము, మంచి ముత్యములను కొనవెదకుచున్న వర్తకుని పోలియున్నది. అతడు అమూల్యమైన ఒక ముత్యమును కనుగొని పోయి తనకు కలిగిన దంతయు అమ్మి దాని కొనును (మత్తయి 13:44-46).

## రాజ్యం యొక్క విలువ

### ''దాచబడిన ధనం'' అనే ఉపమానం

మత్తయి 13:44 ఈ మాటలతో ప్రారంభవౌతుంది: ''పరలోకరాజ్యము పొలములో దాచబడిన ధనమును పోలియున్నది.'' పొలములో దాచబడిన ధనం - అనే భావన మనకు వింతగా తోచవచ్చు. కాని యేసు యొక్క శ్రోతలైతే తమ సమ్మతిని తెలిపేలా తమ తలలు ఊగిస్తుండేవారు. ఆ దినాల్లో - ఒకడు డబ్బుగాని, విలువైన వస్తువులుగాని బ్యాంకులో పెట్టాడంటే, తిరిగి తాను వెళ్లి తీసికోబోయేలోగా (అది) ఉంటుందో, లేదో! గనుక అనేకులు, మత్తయి 25:18లోని ఒక తలాంతు వానిలా, విలువైన తమవాటిని భూమిలో దాచి పెట్టుకునేవారు.

ఇలా దాచుకొనడానికి మరో కారణంవుంది. ఆ ప్రాంతం ఏ సమయంలోనైనా, దాడికిలోనైయుండే అవకాశం వుండేది. పాలస్తీనా ఐగుప్తు మెసపటోమియాలకు మధ్యలోవుంది. గనుక గతంలో దాడి చేసే సైన్యాలు ఆ భూభాగం గుండా బహు

తరచుగా వెళ్లుతూ ఉండేయి. ధనికుల్లో అనేకులు తమ ఆస్తిని మూడు భాగాలుగా చేసికొని, ఆయా దాడులకు సిద్ధపడియుండేవారు. మూడింట ఒక వంతు వాడుకలోని మూలధనంగా ఉంచుకొనేవారు. మూడింట మరోవంతు నగలు, నాణ్యాలు, వగైరా తేలికగా రవాణా అయ్యే వస్తురూపంలో ఉంచుకొనేవారు. దాడిచేసే సైన్యంనుండి వారు పారిపోయేటప్పుడు వాటిని లంఘించుకొని (పట్టుకొని) వెళ్లేవారు. చివరి (మూడింట) ఒక భాగం భూమిలో దాచుకునేవారు. యుద్ధం ముగిసిన తరువాత వారు తిరిగి అక్కడికి వచ్చినప్పుడు యిది వాడుకునే మూలధనంగా ఉండేది. కొన్నిసార్లు అక్కడికి తిరిగి రాలేక పోయేవారు. ఈ రూపంగా పాలస్తీనా భూభాగమంతటిలో దాచబడిన ధనం ఉండేది.

యేసు యొక్క ఉపమానం యిలాటి దాచబడిన ధనాన్ని గూర్చినది. దాచబడిన ధనం అనే భావన మనలను ఆకర్షిస్తుంది. దాచబడిన ధనాన్ని గూర్చిన కథలు లోకంలోని ప్రతి భాగంలో ఉన్నాయి. ముంచివేయబడిన ఓడలోని నిధులు, ఓడ దొంగల నిధులు లేక పోగొట్టుకొనిన బంగారు గనులు వగైరాలు ఈ కోవకు చెందినవే. ఈ మధ్య వ్యాకో, టెక్సాస్‌లో జెస్సీ జేమ్స్ అనే వ్యక్తి డబ్బుతోను యితర విలువైన వస్తువులతోను నింపబడిన ఒక పెట్టిని ఆ ప్రాంతంలో పాతి పెట్టినట్టు యిద్దరు వ్యక్తులు ఒప్పించ బడ్డారు. బుల్ డోజర్ తోలేవాడికి ఎక్కడ త్రవ్వాలో చూపి, వారు పర్యావేక్షణ చేస్తున్నట్టు TV రిపోర్టు చూపింది. చివరికి నేను విన్నదేమంటే, వారు 140,000 డాలర్లు త్రవ్వడానికే ఉపయోగించారు. దీనికంతటికి వారు చూపింది పెద్ద గొయ్యి మాత్రమే!

ప్రభువు ఉపమానం కేవలం దాచబడిన ధనాన్ని గూర్చినదికాదు; అది దొరికిన ధనాన్ని గూర్చినది. ''ఒక మనుష్యుడు దాని కనుగొని దాచిపెట్టి, అది దొరికిన సంతోషముతో వెళ్లి, తనకు కలిగినదంతయు అమ్మి, ఆ పొలమును కొనును'' (44 వ.).

ఇతన్ని మనం పేదవాడనుకోవచ్చు. తాను పని చేస్తున్న పొలానికి అతడు సొంతగాడుకాడు. అతడొక సాధారణమైన శ్రామికుడు. ఒకవేళ ఆ పొలం యొక్క యజమానికి అతడు సేవకుడై యుండవచ్చు. త్రవ్వుతునో, దున్నుతునో నెమ్మదిగా పోతున్నాడు. తన ముఖంలో ఏ నిరీక్షణాలేదు. ఈ రోజు నిన్నటిలా వుంది, రేపు ఈ రోజులా వుండబోతుంది. అతని జీవితమంతా కష్టమైన పని, కలలేని నిద్ర, కష్టమైన పని, కలలేని నిద్ర అనేవి అంతంలేని చక్రంలా తిరుగుతున్నాయి. దృశ్యమంతా ఈలాటి పంథాలో జరిగియుండవచ్చు.

ఈ రోజైతే తన పనిముట్టు భూమిలో దిగబడినప్పుడు ''క్లంక్'' అనే శబ్దం వచ్చింది. ''అది రాయైయుండవచ్చు''నని తాననుకున్నాడు. తన పొలంలోనుండి రాళ్లన్నిటిని ఎత్తి పారవేయుమని తన యజమానుడు చెప్పాడు. గనుక కొద్దిగా మూలుగుతూ, తన మోకాళ్ల మీద వంగి, తన వ్రేళ్లతో మట్టిని లాగ నారంభించాడు. కాని భూమిలో ఉన్నది అతనికి రాతిలా అనిపించలేదు. అది నాలుగు మూలలుగల

ఆకారంలోవుంది. ఆ పెట్టె మూతపైనున్న మట్టిని తుడిచేటప్పుడు అతని గుండె ఎక్కువగా కొట్టుకోనారంభించింది. అతడు ఆ పెట్టెని తెరిచినప్పుడు - నగలు నాణ్యాలతో నింపబడిన ఊహాతీతమైన ఆ ధననిధి కన్పించింది.

చుట్టూ పారజూచాడు. సమీపంలో ఎవడూ లేడు పెట్టెని మూశాడు. ఆ గుంటలో దాన్ని తిరిగి పెట్టాడు. ''నేను ఏమి చేయాలి?'' అనే ఆలోచనలో పడ్డాడు. ''నేనేమి చేయాలో నాకు తెలుసు!'' అని బిగ్గరగా అన్నాడు.

పొలంలో తన పనిముట్లను వదలి పెట్టాడు. ఇంటికి వెళ్లి, తాను అమ్మగల వాటినన్నిటిని సమకూర్చాడు. తానున్న గదిలోనికి భార్య వచ్చింది. ఆమె తల్లి తనకు వదలి వెళ్లిన నెక్‌లేస్‌ను ఆమె వేసికొని యుంది. ఆ దంపతులకు సొంతమై విలువైయున్న వస్తువు ఆ ఒక్కటే, ఆమె మెడలోనుండి అతడా నెక్‌లేస్‌ను లాగి వేసుకొన్నాడు. ''నీవు చేసేదేమి? నీకు పిచ్చిపట్టిందా?'' అంటూ ఆమె ఎగయూపిరితో అరిసింది. ''దీన్ని నేను అమ్మబోతున్నా!''నని యికిలించాడు. ''దానిని అమ్మొ! అయినా నాకున్న నగ ఆ ఒక్కటే'' (నని ఆమె అంది). ''నీవు తొందరలోనే నగలను ధరించుకొంటావ్'' అంటూ తలుపువైపు నడిచే అతడు ఆ మాటలను విసరి వెళ్లాడు. చింపిరిగా ఉన్న తన బట్టలవైపు చూపి, ''నిజమే, నా అందమైన గౌను మీద ఆ నగలు బలే ఉంటాయిలే'' అని అంది.

వక్రోక్తిగల ఆమె మాటలను అతడు వినలేదు. చేతిలో నగ ఉంది. గొల్లైను, సామాగ్రితో మోపబడిన తన గాడిదను తోలుతూ, పాటలు పాడుకొంటూ రోడ్డు మీదికి వెళ్లాడు. వెంటనే తనకు కలిగినదంతా అమ్మాడు. చివరికి అతడా పొలాన్ని కొని, ''ఇప్పుడు యిది నాది; ఇది నిజంగా నాదే'' అంటూ అతడానందించాడు.

ఈ కథలో ఉన్న నీతి, చట్టబద్ధత, వగైరాలతో మనం అతుకబడ నవసరంలేదు. ఆ మనుష్యుడు చేసింది తప్పో, రైటో కూడా మనకు తెలియదు. తాను కనుగొన్న ధనానికి తానే హక్కుదారుడని రబ్బీల చట్టమంది. తన హక్కుపై ఎవరూ తగవులాడ కుండేలా అతడు దాన్ని కొన్నాడు. మన ఉపమానానికి సంబంధించినంతవరకు యిలాటి వాటికి ఎట్టి ప్రాముఖ్యతాలేదు. అసలు రూలేమంటే - ప్రభువు యొక్క ఉపమానాల్లో ప్రతీదీ ఒక ప్రధానమైన సత్యాన్ని బోధిస్తుంది. ప్రతి వివరాన్ని మనం వర్తింపజేయకూడదు. మన మనస్సులో యేసు ఏమి ముద్రించాలనుకున్నారో, ప్రధానమైన ఆ ఆలోచన కొరకే మనం వెదకాలి.

ఒక్క వచనపు ఉపమానాన్ని మరలా చూడు. యేసు ఒత్తి పలికింది ధనం మీదనే గాని, వ్యక్తి మీదకాదన్నట్టు కన్పిస్తుంది. ''పరలోక రాజ్యం ... ధనాన్ని పోలినది'' యేసు ఒత్తి పలికేదేమంటే - దేవుని రాజ్యం - ధనంలాంటిది. అది మనం ఊహించగలిగి నంతకంటె - మహాద్భుతమైనది; అమూల్యమైనది; ప్రశస్తమైనది.

**అమూల్యమైన ముత్యమును గూర్చిన ఉపమానం**

45వ వచనం ''మరియు'' అంటూ ప్రారంభమౌతుంది. రాజ్యాన్ని గూర్చిన భావన ఒక ఉపమానంలో యిమడ్చలేనంత విశాలమైనది, గనుక యేసు మరొక ఉపమానాన్ని యిచ్చారు. ''పరలోకరాజ్యము ... వర్తకుని పోలియున్నది'' (45 వ.). ముందు ఉపమానంలో ఒత్తిపలికింది - ధనం మీద. ఈ ఉపమానంలో ఒత్తి పలికింది మనిషి మీద.

ఆ మనుష్యుడు ''మంచి ముత్యములను వెదకుతున్నాడు'' (45 వ.). ముందు ఉపమానంలో - మనుష్యుడు ఎదురు పడిన ''నిధి'' వద్ద తొట్రిల్లాడు. అతడు దాని కొరకు వెదకడం లేదు. అతడు కేవలం తన పనిచేస్తుండగా, ఎదురు చూడని దాన్ని కనుగొన్నాడు. అలాగే, కొందరు ఎదురైన సత్యంవద్ద తొట్రిల్లి, దాన్ని గుర్తించి సంతోషంతో దాన్ని అవలంభిస్తారు - కొందరైతే దాని కొరకు వెదకుతూవుంటారు.

యోహాను 3, 4ల్లో ఆ వ్యత్యాసం - ఉదహరించబడింది. 3వ అధ్యాయంలో నీకొదేము తన ప్రశ్నలకు జవాబులు వెదకుతూ మెస్సీయాను కనుగొన్నాడు. 4వ అధ్యాయంలోనైతే, సమరయ స్త్రీ నీళ్ల కొరకు వచ్చింది, క్రీస్తును గూర్చిన సత్యం దగ్గర తొట్రిల్లింది. అపొస్తలుల కార్యాలు 8-9 మరొక ఉదాహరణ నిస్తాయి. అపొ. 8లో గ్రంథాన్ని చదువుతూ పయనిస్తున్న ఐతియొపీయుడైన మంత్రి సమాధానాలను వెదకుతున్నాడు. అపొ. 9లో సౌలు ప్రతి క్రైస్తవుని నశింపజేయాలనే ఉద్దేశంతో పయనించాడు. వారు తమ ప్రయాణాలను ముగించక పూర్వమే వారిద్దరూ యేసును గూర్చిన సత్యాన్ని నేర్చుకున్నారు.

నీవు ఆరాధనా కూడికలకు ఎందుకు వెళ్లతావ్? నీవు సత్యాన్ని వెదకే వాడవేనా? నీ జీవిత ఉద్దేశమేమో తెలిసికొనగోరుతున్నావా? నీ జీవితాన్ని ఉత్తేజపరచేది ఏదో కనుక్కోవాలని నీవు ఉద్దేశిస్తున్నావా? నీ దేవునితో నిత్యత్వం గడపగోరే నీవు వెళ్లుతున్నావా? లేక నీవు వెళ్లే కారణం - అంతటి ఉన్నతమైన భావంతో కూడింది కాదా? వెళ్లాలనే నీ భావనే ప్రాముఖ్యమయింది కాదు. ఆ ధననిధినీ కంటబడినప్పుడు దానిని గుర్తించగల సామర్థ్యం నీకు ఉందా, లేదా అనేది అతి ప్రాముఖ్యం. నీవు ఆ ధననిధిని గుర్తించినప్పుడు దాన్ని నీ సొంతం చేసికోవాలనే కోర్కె నీలో మండుతుందో లేదో అనేది అతి ప్రాముఖ్యం.

మన కథతో ముందుకు సాగుదాం. ఆ మనుష్యుడు ''మంచి ముత్యాల'' కొరకు వెదకుతున్నాడు. ఆణిముత్యాలనేవి - విలువైన ఆభరణాలుగా ఈ రోజుల్లో ఎంచబడతాయ్. బైబిలు దినాల్లోనైతే అవి మరి ఎక్కువ విలువైనవిగా ఎంచబడేయ్. జనులు వాటిని సంపాదించుకొని, వాటిని చూచుకొనడం మాత్రమేగాక వాటిని చేత పట్టుకొని ముద్దులాడేవారట. వాటి యొక్క నున్నటి చల్లదనాన్ని తడవి చూస్తూ, పాలవంటి లోతుల్లోనికి చూడ నిష్టపడేవారట. మాయా మంత్రాన్ని నమ్మేవారికి

ఆణిముత్యాలు బహు ఆకర్షణీయంగా ఉండేవట. ఆణిముత్యాల వ్యాపారిని సాటిలేని వస్తువులు గల ప్రముఖుడుగా (జనులు) భావించేవారట.

నగలన్నిటిలో ఆణి ముత్యాలు ప్రత్యేకమైనవి. అనేక రకాలైన రత్నాలు వేలకొలది సంవత్సరాలుగా భూమిలో జరిగే ఒత్తిడి, వేడిమి అనే వాటివలన ఏర్పడతాయి. కాని ఆణిముత్యాలు ఎలా తయారౌతాయో ఈ క్రింద చదివిచూడు: ఒక ఇసుక రేణువు ఆలిగవ్వలోనికి వెళ్లుతుందట. ఈ ఇసుక రేణువు ఆ ఆలిగవ్వకు బాధకలిగించుతూ వుంటుందట. గనుక ఆ బాధను పోగొట్టు కొనడానికిగాను ఆలిగవ్వ పొలరంగులో వుండే చిక్కని ద్రవాన్ని ఊరించి, ఆ ఇసుక రేణువు చుట్టూ కప్పు తుందట. ఈ ద్రవం గట్టి పడే వరకు ఆలిగవ్వ తన బాధనుండి విముక్తి పొందుతుందట. అది గట్టి పడగానే మరలా బాధ ప్రారంభమౌతుంది గనుక మరలా ద్రవాన్ని ఊరించడం - అనే కార్యక్రమం ఆణిముత్యం తయారయ్యేవరకు జరుగుతుందట. శ్రమానుభవంతో తయారయ్యే నగ ఆణిముత్యమేనని చెప్పుతారు. ఆ దినాల్లో, మధ్యదరా సముద్రపు ప్రత్యేక ప్రాంతాలనుండి, ఎర్ర సముద్రంనుండి, పర్షియన్ గల్ఫ్‌నుండి, యిలా భూమిమీద కొన్ని ప్రాంతాలనుండే ఆణిముత్యాలు వచ్చేవి.

ఈ మనుష్యుడు ముత్యాల కొరకు చూస్తున్నమాట వాస్తవమేగాని, దేనినంటే దానిని కొనడానికి మాత్రం కాదు. అతడు ''మంచి ముత్యాల'' కొరకు వెదకుతున్నాడు. ఉండేవాటిలో అత్యుత్తమమైన దానికొరకు చూస్తున్నాడు. ముత్యాలు ఎగుడు దిగుడుగా తయారయ్యేది కద్దు. కొన్ని సార్లు ముత్యం ఒరుగులేని గుండ్రంగా తయారుకాదట. కొన్ని సార్లు ముత్యం చాలా చిన్నదిగా ఉంటుందట. కొన్ని సార్లు రంగు అన్ని చోట్ల సమంగా ఉండదట. గనుక ఈ వ్యాపారి మనస్సులో ఇంతకముందు ఎన్నడు కనుగొననిది కావాలనివుంది. తక్కిన ముత్యాలతో పోలిస్తే, లోపంలేని ముత్యం యొక్క స్వరూపం తన మనస్సులోనే వుండి పోయింది. వేలకొలది ముత్యాలను అతడు తన వ్యాపారంలో నడిపినా, నాణ్యమైన ముత్యాలను కనిపెట్టడంలో తన కండ్లు, చేతులు నైపుణ్యం గలవైయున్నాయి.

ఒక రోజున ఆశ్చర్యకరమైన యొక సంఘటన జరిగింది. వెయ్యి జీవిత కాలాల్లో ఒక్కసారి మాత్రమే జరిగేలాటి సంగతి సంభవించింది. తాను కోరిన ఆదర్శమైన, లోటు లేని ( ఒరుగూ వంకాలేని) ముత్యాన్ని అతడు ఆ దినాన కనుగొన్నాడు. అతడు దాన్ని కనుగొన్నప్పుడు, వెనుక ముందు ఆడలేదు; లేక స్వల్పానికి పట్టుదల చేయలేదు (బేరమాడలేదు). అయితే గొప్ప విలువైన ఆ ఒక్క ముత్యం అతనికి కనబడినప్పుడు, అతడు వెళ్లి తనకు కలిగినదంతయు అమ్మి, దాన్ని కొన్నాడు.

ముందటి ఉపమానంలాగే, ఈ ఉపమానంలో కూడా, వివరాల కొరకు నొక్కకూడదు. మొదటి ఉపమానంలోనైతే, స్వల్పంగా చెల్లించి ఎక్కువైన దాన్ని పొందాడు. ఈ ఉపమానంలోనైతే యితడు పూర్తి ఖరీదును చెల్లించాడు. ఎంత

అధికమో లేక ఎంత తక్కువో - మొత్తానికి డబ్బు చెల్లించడం అనేది ఈ రెండింటిలో - ఏ ఒక్క ఉపమానంలో కూడా ప్రాముఖ్యమయ్యిందికాదు. నరుడు తన రక్షణను తాను కొనలేడు. ప్రభువైన యేసు రక్తం మాత్రమే దాన్ని కొనగలుగుతుంది. నీవుగాని, నేనుగాని ఆత్మసంబంధమైన దీవెనలు పొందతగం; వాటిని సంపాదించలేం, కొనలేం. అలాటప్పుడు, అమూల్యమైన గొప్ప ముత్యమనే ఈ ఉపమానం ద్వారా, మనం నేర్చుకోవాలని ప్రభువు కోరే పాఠమేమి? దాచబడిన ధనాన్ని కనుగొన్నవాడు, దానికొరకు తనకు కలిగినదంతా యివ్వడానికి యిష్టపడ్డాడు!

ఈ రెండు ఉపమానాలను మనం సంగ్రహించినట్లయితే, దాన్ని ఈ విధంగా చెప్పవచ్చు: లోకంలో లభించే వాటన్నిటికంటే - పరలోక రాజ్యం ఎంతో అమూల్యమైనది, అతి ప్రశస్తమైనది, బహుగా కోరదగినది!

## (పరలోక) రాజ్యం యొక్క గుర్తింపు

అంతగా విలువైయున్న ఆ ''పరలోకరాజ్యం'' అంటే ఏమి? పరలోక రాజ్యమనే పద ప్రయోగాన్ని బట్టి, పరలోకాన్ని గూర్చియే మాట్లాడబడినట్లు మొదటిగా తలంపు రావొచ్చు. కొన్నిసార్లు ఈ ''రాజ్యం'' అనే పదం పరలోకానికి సూచింపబడ్డా, ఈ లేఖన భాగంలో మాత్రం అలా చేయబడలేదు. మార్కు, లూకాల్లో యిలాటి ఉపమానాలే దాఖలు చేయబడినా, వారు ''దేవునిరాజ్యము'' అనే పద ప్రయోగాన్ని చేశారు (మార్కు 4:11, 26, 30; లూకా 8:10). అంత విలువైనట్టిదిగా చెప్పబడే ఈ దేవుని రాజ్యమంటే - ఏమి?

''దేవునిరాజ్య'' పదాల ప్రయోగం అనేక లేఖనాల్లో కన్పిస్తుంది. ప్రత్యేకమైన పరిధిలో జరిగే దేవుని పాలనను ఈ మాటలు సూచిస్తున్నాయి. ఆయా సందర్భాలలో సర్వలోకానికి, లేక విశ్వమంతటికి కూడా వర్తించేలా బైబిలు వీటిని సూచించింది. దేవుడు సర్వాన్ని ఏలేవాడు గనుక ఆ పదాలు అలా ప్రయోగించబడ్డాయి. ఏది ఎలాగున్నా, మామూలుగా, తన ప్రజల జీవితాల్లో, వారి హృదయాల్లో జరిగే ప్రత్యేకమైన ఆధిపత్యాన్ని ఈ మాటలు సూచిస్తాయి. వీరు ఆయన అధికారానికి తమ్మును తాము లోబరచు కొన్నవారే! పాతనిబంధనలోని ఇశ్రాయేలీయులు సీనాయి పర్వతము నొద్ద దేవునితో నిబంధన చేసికొన్నందున వారు ఆయన రాజ్యమైయున్నారు.

అది ఎలాగున్నా, మనం పాతనిబంధనను చదివేటప్పుడు, ప్రత్యేకమైన రాజ్యం స్థాపింపబడబోతుందని ఇశ్రాయేలీయులు కనిపెట్టినట్టు కన్పిస్తుంది (దాని. 2:44 చూడు). అది ''మెస్సీయా'' అనే రాజు చేత పరిపాలించబడుతుంది (దాని. 9:25-26) ''మెస్సీయా'' అంటే అభిషిక్తుడని అర్థం. ఇశ్రాయేలు రాజులు ''యెహోవాచే అభిషేకింపబడినట్లు తెలియబడ్డారు (1సమూ. 24:10; 26:9). పాతనిబంధన అంతటిలో మెస్సీయా వచ్చి తన రాజ్యాన్ని స్థాపిస్తాడనే భావన

కొనసాగింది.

యేసే మెస్సీయాగా భావింపబడ్డారు. మెస్సీయా అనే మాటకు గ్రీకు రూపం ''క్రీస్తు''. క్రీస్తు అనబడిన యేసు వచ్చినప్పుడు, - ''పరలోక రాజ్యము సమీపించియున్నది గనుక మారుమనస్సు పొందుడి'' అని ఆయన ప్రకటించారు. (మత్తయి 4:17). మరో విధంగా చెప్పాలంటే - ''రాజ్యమును గూర్చిన పాతనిబంధన వాగ్దానాలు ప్రవచనాలు నెరవేర్చబడే కాలం దగ్గరకు వచ్చింది.'' ఆ రాజ్యాన్ని గూర్చి యేసు మాట్లాడినప్పుడు, ''నా రాజ్యము ఈ లోకసంబంధమైనది కాదు అని ఆయన నొక్కి చెప్పారు'' (యోహాను 18:36). ఆయన పరిపాలన ఆత్మసంబంధమైనది.

ఆయన మరణానికి ముందుగా, ''దేవుని రాజ్యము బలముతో వచ్చుట'' మీరు చూతురని యేసు తన శిష్యులతో అన్నారు (మార్కు 9:1). ఆయన మరణం, సమాధి, పునరుత్థానాల తరువాత, వారు ''పై నుండి శక్తి పొందువరకు యెరూషలేములో కనిపెట్టియుండుడని'' యేసు తన అపొస్తలులకు ఆదేశించారు (లూకా 24:49). ఆయన ఆరోహణం కాబోయేముందు - ''పరిశుద్ధాత్మ మీమీదికి వచ్చినప్పుడు మీరు శక్తి నొందెదరు'' అని వారికి తెలిపారు (అపొ. 1:8). కొద్ది రోజులు తరువాత, యూదుల పెంతెకొస్తు అను పండుగ దినాన, పరిశుద్ధాత్మ వారి మీదికి దిగివచ్చాడు (అపొ. 2:1-4). పరిశుద్ధాత్మ వచ్చినప్పుడు శక్తివచ్చింది. శక్తి వచ్చినప్పుడు, రాజ్యం వచ్చింది. శతాబ్దాల తరబడి ఎదురు చూడబడిన రాజ్యం క్రీస్తుయొక్క మరణం, సమాధి, పునరుత్థానాల తరువాత వచ్చిన పెంతెకొస్తు దినాన చివరిగా స్థాపింపబడింది. అప్పటినుండి రాజ్యం ఉనికిలో (నిలిచి)యున్నట్టు చెప్పబడింది (కొలస్సీ. 1:13).

అపొ.కా. 2 తరువాత - ఇదే సంస్థకు మరో నామం వాడుకలోనికి వచ్చింది: ఆ నామం - ''సంఘం'' అనేది. '' మేము మీ రాజ్యాన్ని ప్రేమిస్తున్నాం ప్రభువా'' అనే పాట మేము తరచుగా పాడుతూ ఉంటాం. దాని మొదటి చరణం యిలా ఉంటుంది:

> నేను నీ రాజ్యాన్ని ప్రేమిస్తాను, ప్రభూ, నీ నివాస స్థలమైన నీ యింటిని మంగళకరమైన మా విమోచకుడు రక్షించిన సంఘం. ప్రశస్తమైన ఆయన స్వరక్తముతో ఓ దేవా! నేను నీ సంఘాన్ని ప్రేమిస్తున్నాను.

క్రొత్త నిబంధన అంతటిలో, సంఘము ప్రత్యేకమైన నేటి దేవుని రాజ్యమై యున్నట్టు చెప్పబడుతుంది. ఆయన ఆధిపత్యానికి తమ్మును తాము లోబరచుకొన్న జనులను సంఘమనే ప్రత్యేక పరిధి మీదనే దేవుడు నేడు ఏలుబడి చేస్తున్నాడు.

క్రొత్త నిబంధనలో ''సంఘము'', ''రాజ్యము'' అనేవి పర్యాయపదాలుగా వాడబడ్డాయి. ఉదాహరణకు, యోహాను 3:3, 5లో - నీటి మూలంగాను ఆత్మమూలంగాను జన్మించితే ఒకడు దేవుని రాజ్యంలో ప్రవేశిస్తాడని యేసు చెప్పారు. అయినా, పరిశుద్ధాత్మచే ప్రేరేపించబడిన వారిచే నడిపింపబడి బాప్తిస్మం పొందినవారు సంఘములో చేర్చబడినట్టు అపొస్తలుల కార్యాలను, ఎఫెసీలోను చూస్తాం (అపొ.

2:38, 41, 47; 1కొరింథీ. 12:13). మత్తయి 16:18లో యేసు తన సంఘాన్ని కడతానని చెప్పారు. అయితే ఆయన అలా కట్టేదాన్ని ''రాజ్య''మని సూచించారు (19 వ.). పైగా, యేసు ప్రభురాత్రి భోజనాన్ని ప్రవేశ పెట్టినప్పుడు లేక ఏర్పాటు చేసినప్పుడు - '' దేవుని రాజ్యము వచ్చువరకు'' దాని రుచి చూడనని ఆయన చెప్పారు (లూకా 22:16, 18). అపొస్తలుల కార్యాల్లోను, పత్రికలలోను సంఘం ప్రభురాత్రి భోజనంలో పాల్గొన్నట్టు కన్పిస్తుంది. (అపొ. 20:7; 1కొరింథీ. 11:17-34).

## ప్రశ్న ఏమంటే -

## దేవుని రాజ్యాన్ని పొందడానికి గాను

## ఏదైనా త్యాగం చేయ

## నిష్టపడుతున్నావా?

గనుక మత్తయి 13లోని రెండు ఉపమానాల సంగ్రహాన్ని మరు మాటలతో చెప్పాలంటే యిలా అనవచ్చు: లోకంలో లభించే వాటన్నిటికంటే సంఘం ఎంతో అమూల్యమైనది. అతి ప్రశస్తమైనది, బహుగా కోరదగినది.

వెంటనే, ఒక ఆక్షేపణను విన్నా: ''కొంచెం సేపు ఆగు! నీవు బోధించే స్థలంలో ఆరాధించేవారు అంత విలువైన వారుగా నాకు కన్పించలేదు!'' వారు నీకు అలా కన్పించినా కన్పించకపోయినా, వారు విలువైనవారే. ఇది నేను కట్టిన విలువకాదు అది దేవుడు కట్టింది. వారిని కొనడానికి క్రీస్తు రక్తం కావలసి వచ్చింది (అపొ. 20:28).

నా ప్రతిపాదనను వివరించితే సహాయపడుతుంది. ''సంఘం'' అనే పదాన్ని నేను ప్రయోగించినప్పుడు, మానవ నిర్మిత సంస్థకు కాదు, క్రొత్త నిబంధనలో మనం చదివే సంఘానికే వర్తింపజేస్తున్నా. సంఘము తక్కిన బైబిలు భావనలనుండి వేరు చేయబడ నేరదు.

ఉదాహరణకు, ''సంఘము'' యేసుక్రీస్తు నుండి వేరు చేయబడ నేరదు. యేసు సంఘమునకు శిరస్సైయున్నాడు; సంఘము ఆయన శరీరమైయుంది (ఎఫెసీ. 1:22-23). సంఘము క్రీస్తు యొక్క సంపూర్ణతయైయుంది (ఎఫెసీ. 1:23). క్రీస్తు, సంఘం ఎంత సన్నిహితంగా ఉన్నారంటే, సౌలు సంఘాన్ని హింసిస్తున్నాడు (అపొ. 8:3), ''నీవు నన్ను ఎందుకు హింసించుచున్నావు?'' అని ప్రభువు అతన్ని అడిగారు (అపొ. 9:4). గనుక, మనం సంఘాన్ని గూర్చి మాట్లాడుతున్నామంటే, యేసుక్రీస్తును దానితో చేర్చామన్న మాటే - లోకంలో లభించే వాటికంటే - ఆయన ఎంతో

అమూల్యమైన, అతి ప్రశస్తమైన, బహుగా కోరదగిన వారు అన్న విషయం అందరు అంగీకరించి తీరవలసిందే.

సంఘము రక్షణనుండి వేరుచేయబడనేరదు. సంఘం కొరకు సిలువపై యేసు ''తన్ను అర్పించుకొన్నారు'' (ఎఫెసీ. 5:25). సంఘాన్ని ఆయన ''తన స్వరక్తంతో'' కొన్నారు (అపొ. 20:28). ఆయన సంఘానికి రక్షకుడైయున్నారు (ఎఫెసీ. 1:22-23; 5:23). జనులు తనకు విధేయులై ఆయన కృపచేత రక్షింప బడినప్పుడు, ఆ సంఘానికి దేవుడు వారిని చేర్చుతాడు (అపొ. 2:38, 41, 47). యేసు రక్తంచే రక్షింపబడిన ప్రజలే సంఘం. గత పాపములనుండి రక్షింపబడటం, పరలోకపు నిరీక్షణ కలిగియుండటమనేవి - లోకంలో ఉన్నవాటన్నిటికంటే - ఎంతో అమూల్యమైనది అతి ప్రశస్తమైనవి; బహుగా కోరదగిన వంటే - అందరు అంగీకరిస్తారు!

ప్రభువు ఈ ఉపమానాలలో - ''దేవుని రాజ్యము'' ''పరలోక రాజ్యము'' అనే పదప్రయోగం చేసినందున, ఆ సంఘం - దేవునినుండి లేక ఆయన సింహాసనం నుండి వేరుపరచబడనేరదు. మరో విధంగా చెప్పాలంటే - ''దాచబడిన ధనం'' లేక ''గొప్ప విలువైన ముత్యం'' అనే వాటిని గూర్చి మనం మాట్లాడినప్పుడు, ఆత్మసంబంధమైన ధననిధిని గూర్చి మాట్లాడుతున్నాం: సత్యం, యేసు, రక్షణ, (సంఘం అని పిలువబడే) క్రీస్తు రక్తంచే కొనబడిన ప్రజలతో సహవాసం, దేవునితో సహవాసం, పరలోకపు నిరీక్షణ అనే వగైరాలు అందులో యిమిడి ఉన్నాయి. వీటిలో ఏది కూడా సంఘం - రాజ్యం అనే క్రొత్త నిబంధన ఉపదేశంనుండి వేరుచేయబడ వీలులేదు. ఆత్మ సంబంధమైన ఈ వాస్తవాలు లోకమంతటిలో ఎంతో విలువైనవి, అతి ప్రశస్తమైనవి బహుగా కోరదగినవి!

లోకం దీనినంగీకరించదు. అమూల్యమైనవేవియని లోకులను మనం అడిగినట్లయితే, ''కీర్తి'' లేక ''ప్రతిష్ట'' అని అనేకులు జవాబిస్తారు. స్త్రీ పురుష్యుల నేకులు ''ప్రతిష్ట మందిరం''లోనికి చేర్చబడుతూ ఉండగా, ''ఇది నా జీవితంలో అతి ప్రాముఖ్యమైన దినం, నేను జీవించిన సంవత్సరాల్లో యిది అత్యున్నతమైన దినమని అనేకులంటారు!'' ధనం, అధికారం - అనేవి తమ జీవితంలో బహుగా కోరదగినవైనట్లు కొందరంటారు.

ఈ లోకపు విలువ విధానంలో చిక్కుబడకుండడం చాల కష్టం. పెద్ద గదిని ఊహించు. ఆ గదిలో ఒక గోడ మీద చాల తలుపులున్నాయి. ఒక గదిపై ''ప్రతిష్ట'' అని వ్రాయబడియుంది; ఇంకొకదానిపై ''అధికారం'' అని అతికించబడింది. మరింకొక దానిపై ''ధనం''; ఇంకొక దానిపై ''పలుకుబడి'' అని అతికించబడ్డాయి. ఆ ద్వారాల ముందు జనులు పొడవైన బారులు తీరి తమ స్థానం కొరకు ఒకరి నొకరు నెట్టుకొంటున్నారు. దానికి ఎదురునున్న గోడకు ఒక మూలన, సరిగా కానరాని చోట

''పరలోక రాజ్యం'' అనే కాగితం అంటించబడింది. ఆ తలుపు ముందర వ్రేళ్ల మీద లెక్కింప బడగలిగినంతమందే ఉన్నారు. ఆ కొద్ది మందిలో నీవు నిలిచియుండడం తటస్థించితే, తక్కిన తలుపుల వద్ద నిలిచియుండిన వారివైపు చూడకుండా ఉండడం కష్టం; అలా పోగుపడినవారిని చూస్తున్నప్పుడు జీవితంలో ప్రాముఖ్యమైన దానిని పోగొట్టు కొంటున్నానేమో అని ఆలోచన చేయకుండడం కష్టం.

అందువలన మనం చదువుతూవున్న ఈ రెండు ఉపమానాలలోని ప్రభువు యొక్క వర్తమానాన్ని బాగా నేర్చుకో. లోక భోగాలనే తలుపుల వద్ద ఎంతమంది బారులు తీరినా, నిజమైన విలువగలది దేవుని రాజ్యం మాత్రమే! ఉపమానాల్లోని యిద్దరు మనుష్యులు, వాటిని చూచినప్పుడు, నిజమైన విలువగలదేదో వారు గుర్తించగలిగారు. అలాగున, వాటిని పొందడానికిగాను కావలసిన వెల చెల్లించడానికి వారు యిష్టపడ్డారు.

## రాజ్యము యొక్క వెల

''దేవుని రాజ్యం ఎంత అద్భుతమైనదో, ఎంత అమూల్యమైనదో, ఎంత ఆశ్చర్యకర మైనదో, ఎంత విలువైనదో నీవు గుర్తించావా?'' అనే ప్రశ్నను మనకు మనమే వేసికోవాలి.

ఈ ప్రశ్నకు సమాధానం మన లేఖన భాగమే యిస్తుంది. మత్తయి 13:44-46 ల్లోని యేసు మాటలను మరోసారి చూచి, వాటిలో కొన్నింటి ప్రాముఖ్యతను మన మనస్సుల్లో నిలుపుకోవాలి.

> పరలోకరాజ్యము, పొలములో దాచబడిన ధనమును పోలియున్నది. ఒక మనుష్యుడు దాని కనుగొని దాచిపెట్టి, అది దొరికిన సంతోషముతో వెళ్లి, <u>తనకు కలిగినదంతయు</u> అమ్మి ఆ పొలమును కొనును.
>
> మరియు పరలోకరాజ్యము, మంచిముత్యములను కొన వెదకుచున్న వర్తకుని పోలియున్నది. అతడు అమూల్యమైన యొక ముత్యమును కనుగొని, పోయి <u>తనకు కలిగిన దంతయు</u> అమ్మి దాని కొనును.

మనం వాటిని పొందడానికిగాను ఏమి చేయడానికి మనం యిష్టపడతామో దాని మీద ఆత్మ సంబంధమైన వాస్తవముల విలువ ఆధారపడినట్లు అంచనావేస్తాం. ''ఎవడైనను నన్ను వెంబడింపగోరిన యెడల, తన్ను తాను ఉపేక్షించుకొని, తన సిలువ నెత్తికొని నన్ను వెంబడింపవలెను'' అని ప్రభువు తన శిష్యులతో అన్నారు (మత్తయి 16:24).

కొన్ని పరిస్థితుల్లో, ఉపమానాల్లోని మనుష్యులవలె, మన ముందు ఉంచబడిన దైవమార్గాన్ని అనుసరించడానికిగాను, అక్షరార్థంగా మనకు కలిగిన వన్నియు అమ్మవలసిన అవసరం రావచ్చు (మత్తయి 19:21). ఏది యెలాగున్నా, మనలో ఎక్కువ మందికి, మన జీవితాల ద్వారా ఏది నొక్కి చూపుతున్నామో, అదే అతి

ప్రాముఖ్యమైనది. యేసు మనందరికి చెప్పేదేమంటే - ''దేవుని రాజ్యమును ఆయన నీతిని మొదట వెదకుడి'' (మత్తయి 6:33). యేసుతోను (సంఘంతో పాటు) ఆయన వాటితోను ఈ లోకపు వాటిని పోల్చినప్పుడు, ఇవి (ఈ లోక సంబంధమైనవి) ఎన్నిక లేనివై యుంటాయి. ఒకవేళ యివి, ఆత్మసంబంధమైన వాటిలో జోక్యం పుచ్చుకొంటే, వాటిని మన జీవితాల్లోనుండి ఎత్తిపారవేయాలి. దేవుని రాజ్యం మన జీవితాలకు కేంద్ర స్థానమైయుండాలి.

అయితే మన ప్రశ్నేమంటే: ''దేవుని రాజ్యాన్ని పొందడానికి గాను నేనేదైనా త్యాగం చేయ సిద్ధపడియున్నానా?'' చిన్నపిల్లలుగా ఒకరి నొకరు ఎరిగిన యిద్దరు మనుష్యులున్నారు. చాల సంవత్సరాల తరువాత వారు తిరిగి ఏకమయ్యారు. వారిలో ఒకడు ఈ లోకపు సరకులు ఎక్కువగా లేని పేద క్రైస్తవుడు. రెండవవాడు - ఈ లోకపు మార్గంలో పయనించి గొప్ప ధనవంతుడైనవాడు. వారు ఒకరినొకరు కలిసికొన్నప్పుడు వారిద్దరు ఒక విషయంలో సమానంగా ఉన్నారు - ఇద్దరు ఒక్కొక్క కుమారుని పోగొట్టుకున్నారు.

ధనవంతుడు తన కుమారుని మరణాన్ని గూర్చి మాట్లాడినప్పుడు, ఆ బిడ్డమట్టే తన జీవితమూ కలలు తిరిగినట్టు తేటపడింది. ''నా కుమారుడు నా వ్యాపారాన్ని కొనసాగిస్తాడనుకున్నా. ఇప్పుడు నేనేమి చేయాలో నాకు తెలియదు. నా జీవితం పతనమై పోయింద''ంటూ కంట తడిపెట్టాడు.

క్రైస్తవుడు తన కుమారుని గూర్చి మాట్లాడినప్పుడు, ''నా గుండె పగిలింది, అయితే నేను వానిని భయంకరంగా పోగొట్టుకున్నా, తానొక శ్రేష్టమైన స్థలములో ఉన్నాడని నాకు తెలుసు. ఇప్పుడు నేను కొద్ది కాలం బ్రతుకుతాను, నేను తన వద్దకు వెళ్లుతాను; మరల మేము తిరిగి కలిసియుంటాం'' అని చెప్పాడు.

''నీలాంటి విశ్వాసం కొరకు నాకు కలిగిన సమస్తాన్ని యిస్తా''నని ఆ ధన వంతుడు క్రైస్తవునితో అన్నాడట. అందుకు క్రైస్తవుడు, ''దానికి అంతే ఖరీదౌ తుంది'' అని సున్నితంగా జవాబిచ్చాడట. ఆ ధనాన్ని సంపాదించుకొనడానికిగాను మనకు కలిగిన దంతయు అమ్మడానికి'' యిష్టపడుతున్నామా?

ఇది న్యాయం కానట్టు అనేకమందికి తోచినా, వాస్తవానికి యింతకంటే న్యాయ మయ్యింది మరేదీలేదు. ఈ లోకపు ఐశ్వర్యంతో నింపబడిన ఒక ''షో రూమ్'', ప్రదర్శన గదిని ఊహించు. ఆ (షో రూమ్) ప్రదర్శన గదిలోనికి నలుగురు వ్యక్తులు నడిచిపోయారు. వారిలో ఒకడు ధనవంతుడు. మరొకడు దరిద్రుడు. మిగిలిన యిద్దరు మధ్యతరగతివారు. ఈ యిద్దరిలో ఒకడు నిన్ను, నన్ను సూచిస్తున్నారు. ఈ కథను చిన్నదిగా చేయాలంటే, అతడు నన్ను సూచిస్తున్నాడు.

మేము ఆ షో రూమ్‌లో గుండా వెళ్లేటప్పుడు, నేత్రాలు మిరు మిట్లు గొలిపే చిత్ర దృశ్యాలమీద మా నేత్రాలు పడుతున్నాయి. మేము వాటిని కొనగలమో లేదోనని

ప్రతిసారి ఖరీదు చీటిని చూస్తూవుంటాం. తాను కావాలనుకుంటే, ఆ ధనవంతుడు దేనినైనా కొనగలడు. తాను కొనగలిగిందేది పేదవానికి కన్పించదు. ఆ మూడవవాడు నేను కలిసి కొన్ని వస్తువులనే కొనగలం. వాటిలో ఎక్కువ భాగం మేము కొనలేనంత ఖరీదైనవే!

చివరికి మేము ( షో రోమ్) ప్రదర్శన గది మధ్యకు వచ్చాం. మా కండ్ల ముందు ఒక గొప్ప ''నిధి'' నిలిచియుంది! మా గుండెలు గబగబ కొట్టుకో నారంభించాయి. మా కండ్లను దానినుండి త్రిప్పలేకపోతున్నాం. మేము దాన్ని ఎంత తీక్షణంగా చూస్తున్నామో. ప్రదర్శన గదిలో ఉన్న మిగిలినవన్నీ కేవలం అంత పాత సామానుల కుప్పలా కన్పించాయి. గనుక దీన్ని పొందకుండ మాలో ఎవ్వరం సంతోషంగా ఉండేటట్టులేం. దాని మీద వెల చీటి ఉన్నట్టులేదు. మాలో ఒకరికొకరం - ''దీని వెల ఎంతైయుంటుందో?'' అని అనుకొంటున్నాం.

పేదవాడు తన జేబును తడవుకొన్నాడు. దానిలోనుండి ఐదు సెంట్లను బయటికి తీసి చేత పట్టుకున్నాడు. ''నాకు కలిగినదంతా యిదే'' నంటూ తన విచారాన్ని వ్యక్తపరచాడు. తరువాత వాడు తన ''పర్సు''ను తనకే చేశాడు. ''నా వద్ద ఉన్నదంతా ఈ ఐదు డాలర్లే'' నని అతడన్నాడు. నేను కొంచెం సేపు ఆలోచించాను. ''నాకు కలిగినదంతా అమ్మితే, ఐదువేల డాలర్ల మేరకు రావచ్చు'' నని నేనన్నాను. ''నా ఎకౌంటెంట్ - నేను ఐదు మిలియన్‌లు గలవాడనని ఈ ఉదయమే చెప్పాడని'' ఆ ధనవంతుడన్నాడు. మిగిలినవారి సంగతి ఎలాగున్నా, కనీసం ఆ ధనవంతుడు సహితం సంతోషంగా ఉన్నట్టు లేడు. ఎందుకంటే - ఆ ''నిధి'' దానికంటె కూడా ఎంతో ఎక్కువ విలువగలదైయుంది.

ఆ సమయంలో ఆ వ్యాపారపు యజమాని వారి దగ్గరకు వచ్చి, తాను వారికి సహాయం చేయగలడేమోనని అడిగాడు. కావలసినంత మా వద్దలేని సంగతి మాకు తెలిసినా, '' ఈ నిధి'' ఎంత ఔతుందో తెలిసికోవాలనుకొంటున్నాం, దీని వెల ఎంత? అని అడిగాం. అందుకు ఆ యజమాని చిరునవ్వుతో, ''కొనే సామర్థ్యం మీకు ఉండనవసరం లేదు - అయినా ఫరవాలేదు''. నా కుమారుడు దీని వెల చెల్లించాడు. మీరు చేయవలసినదంతా ఏమంటే - దాన్ని అలాగే అంగీకరించండి. అయితే ఒకమాట. ''దాన్ని అంగీకరించడానికే ఖరీదు ఔతుంది'' అని హెచ్చరించాడు.

మా హృదయాల్లో నిరీక్షణ పొంగింది. ఒకవేళ ఆ నిధి మాదే కావచ్చు. అయినా, అది కూడా ఎంత ఖరీదవుతుందో అనే ప్రశ్న యింకావుంది. పేదవాని వైపు తిరిగి ''- నీ యొద్ద ఎంత ఉంది?'' అని ఆ యజమానుడు అడిగాడు. ''ఐదు సెంట్లు'' అని ఆ పేదవాడు జవాబిచ్చాడు. ''నీకు అది అంతే ఖరీదు ఔతుందని ఆ సొంత గాడన్నాడు''.

తరువాత మనిషి వైపుకు అతడు తిరిగి - ''నీ వద్ద ఎంతుంది?'' అని ఆ

యజమానుడు అడిగాడు. అందుకతడు - ''ఐదు డాలర్లన్నాడు''. దానికా సొంతగాడు - ''నీకు దాని ఖరీదు అంతే ఔతుంద''న్నాడు.

నా వైపు చూచాడు. ''నీ దగ్గర ఎంతుంది?'' అని అడిగాడు. నేను గుటకవేసి ''నాకు కలిగిందంతా అమ్మితే, ఐదువేల డాలర్ల వరకు రావచ్చు''నన్నాను. అందుకతడు - తన తలను ఆడించి, ''నీకు దాని ఖరీదు అంతే ఔతుంద''న్నాడు.

చివరిగా అతడు ధనవంతుని వైపు తిరిగాడు. ''నీ దగ్గర ఎంతవుంది?'' అని అడుగగానే - ''ఐదు మిలియన్ల డాలర్ల'' ని జవాబు వచ్చింది. ''నీకు అది అంతే ఖరీదు ఔతుందని'' ఆ యజమానుడన్నాడు.

దీనికంటే న్యాయమైన దేముంది? నీకు ఐదు సెంట్లు ఉన్నా, లేక ఐదు మిలియన్ల డాలర్లున్నా ఖరీదు ఒక్కటే - అది నీకు కలిగినదంతా! నీకు కలిగియున్న దానికంటె మరి ఎక్కువగా దేవుడు నిన్నడుగడు. అయితే మనకు కలిగియున్న దాని నంతటిని ఆయన అడుగుతున్నాడు.

ఈ లోకపు జనులనేకులు, ఈ ఖరీదు చాల ఎక్కువని అనుకొంటున్నారు. మనం అలాటి త్యాగం చేయలేమంటున్నారు. మాకు కావలసిన వాటిని మేము గట్టిగా పట్టుకోవాలి. మా సమస్తం దేవునికి యివ్వలేమని వారు అల్లరి చేస్తున్నారు. ఒక వేళ నీ నిర్ణయం కూడా అదే అయ్యింటే, దాన్ని అలాగే ఉండనీ! అయితే దీన్ని మాత్రం జాగ్రత్తగా ఆలోచించు. నీవు త్యాగం చేయడానికి యిష్టపడక పోయినట్లయితే, అసలు ఈ జీవితం దేనికో కూడా తెలిసికొనే అవకాశాన్ని పోగొట్టుకుంటావ్. అంతేకాదు. లోతైన అంతరంగపు సంతోషాన్ని, మానసిక శాంతిని పొందుదువనే నిరీక్షణను సహితం వదలుకుంటావ్. ఈ లోకం యివ్వగల ప్రతిదానికంటే ఎంతో ఎక్కువగా అపారమైన జీవమువైపు నీ వీపును త్రిప్పుతావ్.

ఈ సందర్భంలో, 44 వ వచనంలోని చిన్న పద సముదాయాన్ని నేను జారవిడువ తలచుకోలేదు. ''పరలోక రాజ్యము, పొలములో దాచబడిన ధనమును పోలియున్నది. ఒక మనుష్యుడు దాని కనుగొని దాచిపెట్టి, అది దొరికిన సంతోషముతో వెళ్లి, తనకు కలిగిన దంతయు అమ్మి ఆ పొలమును కొనెను''. ''దాని విషయమై సంతోషించి'', నా గాడిదను, గొఱ్ఱెను, నా భార్యకు ఆడంబరమైన నెక్‌లేస్‌ను ఆ ధనం కొరకు అమ్మవలసి వచ్చింది గనుక అది ఎంతటి త్యాగమని అతడన్నట్టు తలస్తున్నావా? ఖచ్చితంగా కాదు. తాను వెళ్లే మార్గంలో పాడుకొంటూ, ప్రతి చెవి యొక్క వినికిడిలో అతడు నవ్వుతూ, తనకు కలిగినదంతా అమ్మడానికి అతడు వెళ్లినట్టు నేను ఊహిస్తున్నాను. ఆ మనుష్యుడు తానిచ్చిన దానికంటే ఎంతో ఎక్కువగా పొందబోతున్నాడే!

దానిని పొందడానికి గాను మనకు కలిగినదంతయు యిచ్చేది, ఆ ''నిధి'' యొక్క ప్రశస్తతను గ్రహించి మాత్రమే. దాని విలువను నీవు నిజంగా అభినందించ

గలిగినప్పుడు, మనం చేయబోయేది ఎక్కువ త్యాగమై యుండదని మనకు అర్థమౌతుంది. మనం చేయగలిగింది ఏమైనా, ఎంతైనా సరే, దేవుడు మనకేమి చేయగలడు లేదా ఏమి చేస్తాడు అనేదానితో పోల్చితే అది లేనట్టే కన్పిస్తుంది. గతంలో తనకు ఏవేవి లాభసాధనాలుగా ఉండేయో వాటిని సూచించి పౌలు ఫిలిప్పీయులకు వ్రాసిన ఉత్తరంలో యిలా అన్నాడు:

> అయినను ఏవేవి నాకు లాభకరములై యుండెనో వాటిని క్రీస్తు నిమిత్తము నష్టముగా ఎంచుకొంటిని. నిశ్చయముగా నా ప్రభువైన యేసు క్రీస్తును గూర్చిన అతి శ్రేష్ఠమైన జ్ఞానము నిమిత్తమై సమస్తమును నష్టముగా ఎంచు కొనుచున్నాను (ఫిలిప్పీ 3:7-8).

## ముగింపు

ఈలాటి మాటలే అక్కడ కూడా కన్పిస్తాయి గనుక, ఈ పాఠం యొక్క తలరాతను చూడగానే, యిది ధనవంతుడైన యవ్వన అధికారిని గూర్చియై యుంటుందని నీవు తలంచియుండవచ్చు. అతడు యేసు నొద్దకు వచ్చి, నిత్యజీవాన్ని పొందడానికి తానేమి చేయాలో తెలిసికోగోరాడు. ''అందుకు యేసు - నీవు పరిపూర్ణుడవగుటకు కోరిన యెడల, పోయి నీ ఆస్తిని అమ్మి బీదలకిమ్ము, అప్పుడు పరలోక మందు నీకు ధనము కలుగును; నీవు వచ్చి నన్ను వెంబడించుమని అతనితో చెప్పెను'' (మత్తయి 19:21).

దీన్ని మరో విధంగా చెప్పాలంటే - నీ పాత సామానుల కుప్పను తొలగించుకో నీకు ''ఆ ధనం'' లభిస్తుంది - అన్నట్టు ప్రభువన్నారు. దురదృష్టవశాత్తు, ఆ యవ్వనుడైన అధికారి పాత సామానుల కుప్పనే హత్తుకోదలచుకున్నాడు. గనుక అతడు విచారించుతూ వెళ్లాడు. ఏది ఎలాగున్నా, ''ఆ ధనాన్ని'' ఆయన బేరపు బల్లమీద పెట్టలేదు. అది ఎన్నటికిని ''సగం వెలకు'' దిగదు. దాని వెల ఎప్పుడూ అలాగే వుంటుంది - నీకు కలిగినదంతా. సంపూర్తిగా నిన్ను నీవు, నీకు కలిగినదంతా ప్రభువునకు అప్పగించుకొంటే, ఆ ధనం - (ఆయన) దీవెనలు నీవైయుంటాయి.